బడి బయట పిల్లలను బడిలో చేర్పండి

- కావలి డిప్యూటీ ఈఓ రఘురామయ్య
- 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించిన విద్యార్థులు
- ప్రభుత్వ పాఠశాలల్లో బోధన, సౌకర్యాలపై అవగాహన ర్యాలీలు

జలదంకి: మండలంలో 6 నుంచి 14 సంవత్సరాల లోపు వయస్సు గల బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కావలి డిప్యూటీ ఈఓ పి.రఘురామయ్య సూచించారు. సోమవారం 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు అందే సౌకర్యాలు, ఉత్తమ బోధనపై జలదంకిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ మేరకు ర్యాలీ నిర్వహించి స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, అధికారులు సమష్టిగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. ఇటుక బట్టీల వద్ద, చేపల చెరువుల వద్ద ఉన్న బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులకు చదువు యొక్క విశిష్టను వివరించి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు అన్ని సౌకర్యాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 శ్రీధర్, ఎంఈఓ-2 నాగేశ్వరరావు, హెచ్‌ఎం కొండారెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'నేను బడికి పోతా'

మర్రిపాడు: మండలంలోని నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో ఉన్న సౌకర్యాలను వివరిస్తూ బడి ఈడు పిల్లలందరూ బడిలో చేరాలని స్థానికులకు అవగాహన కల్పించారు.



జలదంకి: బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసిన విద్యార్థులు



అనుమసముద్రంపేట: మానవహారం ఏర్పాటు చేసిన విద్యార్థులు

కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎస్‌పేటలో..

అనుమసముద్రంపేట: విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం అనుమసముద్రంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. హెచ్‌ఎం ఎంవీఎస్ఎస్ శ్రీధర్ మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాల లోపు వయస్సు గల బాలబాలికలు పాఠశాలల్లో చదువుకోవాలని సూచించారు. డ్రాపౌట్స్‌ను తిరిగి పాఠశాలలో చేర్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎం.జ్యోతి, డి.సాయిప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీఆర్ఎంటీ రఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొండాపురం: బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు తీసుకెళుతున్న ఎంఈఓ తదితరులు

విజయవంతం చేయండి

కొండాపురం: మండలంలో 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖాధికారి ఆనందరావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని భీమవరప్పాడు ఎస్సీ కాలనీ పరిధిలోని ఎర్రబాళెంలో 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబాళెం ఎస్సీకాలనీకి చెందిన 10 మంది బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించారు. పిల్లలను బడిలో చేర్చేందుకు కృషి చేసిన కొమ్మి ప్రభాకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో భీమవరప్పాడు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వి.మాధవ, సాయిపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం బాలకృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మర్రిపాడు: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

భక్తుల సహకారంతో గోశాల గిడ్డంగి నిర్మాణం

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో గోశాలకు అవసరమైన పశుగ్రాసం, దాణా నిల్వ చేసేందుకు వీలుగా దాతలు, భక్తుల సహకారంతో శాశ్వత గిడ్డంగి నిర్మాణం చేపట్టనున్నట్లు ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోశాలలోని గోవులకు అవసరమైన గడ్డివాములకు పది రోజుల క్రితం నిప్పు అంటుకోవడంతో అగ్నికి ఆహుతయ్యాయన్నారు. ప్రస్తుతం భక్తులు, దాతల సహకారంతో గోవుల కోసం పశుగ్రాసం సేకరిస్తున్నట్లు తెలిపారు. పశుగ్రాసం నిల్వ చేసేందుకు శాశ్వత గిడ్డంగి నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గిడ్డంగి నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలనుకునే భక్తులు ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణని 9966217689 నంబరులో గానీ, నేరుగా తనను 9866091155 నంబర్‌లో గానీ సంప్రదించవచ్చని తెలిపారు.

అధికారుల డుమ్మా

సీతారామపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు డుమ్మా కొట్టారు. కేవలం ఇద్దరు అధికారులు మాత్రమే హాజరైనట్లు తహసీల్దార్ కృష్ణారెడ్డి తెలిపారు. అలాగే ప్రజల నుంచి 2 అర్జీలు అందాయని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ఈ కార్యక్రమం తిరిగి సోమవారం నుంచి పునఃప్రారంభించిన సంగతి విదితమే. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరుకాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా కేవలం ఇద్దరు అధికారులు మాత్రమే హాజరుకావడం గమనార్హం.

క్లుప్తంగా

పాఠశాల తనిఖీ



సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆత్మకూరు ఉప విద్యాశాఖాధికారి గోపాల్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనుల పురోగతి, అడ్మిషన్ల వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. ఆయన వెంట హెచ్‌ఎం, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలకు చిన్నారులు



చిన్నారులను పాఠశాలల్లో చేర్చిన అంగన్‌వాడీ సిబ్బంది

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు నిండిన చిన్నారులను పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాన్ని సోమవారం అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, కస్తూరి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.విజయలక్ష్మి, ఎం.సుశీలమ్మ, పి.సావిత్రి, షేక్ షాకీర, అయ్యమ్మ పాల్గొన్నారు.

గంగాభవాని అమ్మవారికి కుంకుమార్చన



కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉదయగిరి: మండలంలోని గంగిరెడ్డిపల్లిలో జరుగుతున్న గంగాభవాని అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా సోమవారం భక్తులు అమ్మవారికి కుంకమార్చన చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు గోపి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని నైవేద్యాలు సమర్పించారు.

విద్యాసామగ్రి అందజేత



విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న డాక్టర్ ప్రణీత్‌చౌదరి తదితరులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంలోని ఆదిఆంధ్ర పాఠశాల విద్యార్థులకు పట్టణానికి చెందిన డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ చౌదరి సోమవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. నోట్‌పుస్తకాలు, జామెంటరీ బాక్స్‌లు, పలకలు, పెన్నులతోపాటు విద్యార్థులకు చాక్‌లెట్‌లు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం లక్కు ప్రసాద్, హెచ్‌ఎం నాగేంద్ర, ఉపాధ్యాయురాలు మాలకొండమ్మ, ట్రస్ట్ సభ్యులు తోడేటి అశోక్, డాక్టర్ కుమార్, పాఠశాల పూర్వ విద్యార్థులు మొలబంటి నాగేంద్ర, తాటిపర్తి పెంచలయ్య, దండు ప్రవీణ్, దేవరకొండ శ్రీనివాసులు, తుపాకుల నాని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు ఆర్థికసాయం



కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం గ్రామానికి చెందిన మెడబలిమి తిరుపతయ్య కుమార్తె భూమిక చదువు నిమిత్తం సోమవారం గ్రామానికి చెందిన జీఎంకే ట్రస్ట్ అధినేత, మండల ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ.20 వేల నగదును తన ట్రస్ట్ ప్రతినిధుల ద్వారా కుటుంబసభ్యులకు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, రాపల్లి తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

మర్రిపాడు: మండలంలోని చుంచులూరు, కదిరినాయుడుపల్లి, టీఎస్‌పేట, బ్రాహ్మణపల్లి, కంపసముద్రం పరిధిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సోమవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పి.విజయభాస్కర్‌రెడ్డి, కె.సుధాకర్, మోహన్‌ప్రసాద్, సాంబశివారెడ్డి, వెంకటయ్య, సుబ్బారెడ్డి, రత్తయ్య, టీసీ వెంగయ్య, భాస్కర్, రంగనాయకులు పాల్గొన్నారు.

సంగంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సంగం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తరుణవాయి, తలుపూరుపాడు గ్రామాల నుంచి రెండు సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేసినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను సచివాలయాల ద్వారానే పరిష్కరించుకోవాలని సూచించారు. సచివాలయాల ద్వారా పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ రమాదేవి

ప్రభుత్వ భూమి ఆక్రమణపై చర్యలు

- కంచె తొలగించి ప్రభుత్వ భూమికి విముక్తి

మర్రిపాడు: ప్రభుత్వ భూమికి రోజురోజుకూ రక్షణ కరువవుతోంది. ప్రాంతాన్ని బట్టి భూముల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ భూములను అక్రమార్కులు ఆక్రమిస్తున్నారు. మర్రిపాడు మండల రెవెన్యూ కార్యాలయం వెనుక భూఆక్రమణదారులు ఏకంగా ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ రాళ్లతో కంచె వేసి ఆక్రమించారు. అది ప్రభుత్వ అధికారుల దృష్టికి వెళ్లడంతో వారు భూఆక్రమణదారులకు నోటీసులు పంపి పోలీసు వారి సహకారంతో సోమవారం ఆ ఎకరా స్థలం చుట్టూ వేసిన ఫెన్సింగ్ రాళ్లను, వైరును తొలగించి రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమికి విముక్తి కల్పించారు.



ప్రభుత్వ భూమి చుట్టూ ఉన్న ఫెన్సింగ్ రాళ్లను తొలగించిన దృశ్యం

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఉదయగిరి: కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయగిరి మండలంలోని గండిపాళెం గ్రామంలో సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ తిరిగి సీజనల్ వ్యాధులు, డయేరియా సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. తొట్లు, టైర్లలో నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. ఏ చిన్నపాటి రుగ్మతకు గురైనా, అలసటగా ఉన్నా వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లపల్లి కల్పన, పంచాయతీ కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రవి, ఏఎన్‌ఎం విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

ఆత్మకూరురూరల్: జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా గురుశిష్య సంబంధాలను తెలియజేస్తూ ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమవారం ఆత్మకూరు మండలంలోని బోయలచిరివెళ్ల, గొల్లపల్లి, నారంపేట గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను చదివి ఆత్మ, పరమాత్మ, జీవాత్మ అనే విషయాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి పొదలకూరు కమిటీ అధ్యక్షుడు పెంచల నరసయ్య, సభ్యులు సరోజనమ్మ, పద్మమ్మ, శేషాద్రి, పెంచలయ్య, హరి, నరసారెడ్డి, భాగ్యమ్మ, విశ్రాంత ఉపాధ్యాయుడు మురగళ్ల సుధాకరాచారి, కొండయ్య, కృష్ణయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లిలో ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

పురుషామృగ వాహనంపై కోటేశ్వరస్వామి

సంగం: మండలంలోని దువ్వూరు శ్రీకోటేశ్వరాలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి పురుషామృగ వాహనంపై గంగా పార్వతీ సమేతుడైన శ్రీకోటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణం అనంతరం ఆది దంపతులకు వసంతోత్సవం నిర్వహించారు. స్వామివారిని పురుషామృగ వాహనంపై కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. తదుపరి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.



పురుషామృగ వాహనంపై విహరిస్తున్న ఆదిదంపతులు

సమస్యల పరిష్కారానికి కృషి

ఉదయగిరి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ పనిచేస్తోందని ఆ సంఘం నాయకులు తెలిపారు. వారు సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎడమ తిరుపతయ్య, మండల నాయకులు ఫణిరాజు, సుబ్బారెడ్డి, మున్నా, సారథి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

సోమశిల: సోమశిల ప్రాజెక్ట్ డివిజన్ నంబర్-1 సూపరింటెండెంట్(ఎఫ్ఏసీ)గా షేక్ ఖాజారంతుల్లా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏపీఎన్‌ఓఎస్ నాయకులు బల్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది సీహెచ్ మహేశ్వరయ్య, కొంగి ఉత్తయ్య, వర్క్ చార్జెడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పలపాటి రామయ్య, ఎస్సీ సబ్ డివిజన్ నంబర్-1 కలువాయి సిబ్బంది ఎంవీ రమణారెడ్డి, ఉప్పలపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మేలు

సీతారామపురం: భూసార పరీక్షలతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని భూసార పరీక్ష కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు కన్నయ్య తెలిపారు. ఆయన సోమవారం సీతారామపురం మండలంలోని మారంరెడ్డిపల్లిలో భూసార పరీక్షల కోసం మట్టి సేకరించే విధానాన్ని పరిశీలించి వ్యవసాయ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏఈఓ నారాయణ, వీఏఏలు నరేంద్ర, లక్ష్మీనారాయణ, ఎంపీఈఓ వెంకటేశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

179 మందికి అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్

వరికుంటపాడు: మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం వైద్య ఆరోగ్య సిబ్బంది 179 మంది వయోజనులకు అడల్ట్ బీసీజీ టీకా వేసినట్లు మండల వైద్యాధికారిణి కరిష్మా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె అడల్ట్ బీసీజీ టీకా వేసే కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలందించారు. అనంతరం మాట్లాడుతూ క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ ముందస్తుగా వేస్తున్నట్లు తెలిపారు. వయోజనులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్ఎన్ సుశీలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

జలదంకి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి సూచించారు. సీజనల్ వ్యాధులపై సోమవారం మండలంలోని జమ్మలపాళెం ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ప్రసూన, హెచ్‌ఎం పి.జయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త జంగం మౌనిక, వీఆర్‌ఏ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

వరికుంటపాడు: మండలంలో చిన్నారులు, బడి ఈడు పిల్లలందరినీ తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీఓ వెంకటకృష్ణకుమారి సూచించారు. ఆమె సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, క్షేత్రస్థాయిలో సిబ్బంది అలసత్వం వహించకుండా బాధ్యతగా కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ షావుద్దీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటకృష్ణకుమారి

ఉపాధి హామీ పనులకు బ్రేక్

సీతారామపురం: మండలవ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు బ్రేక్ పడింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే మండలంలోని 14 పంచాయతీల్లో చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి టీడీపీ సానుభూతిపరులకు అవకాశం కల్పించాలని అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో మండలంలో తాత్కాలికంగా ఉపాధి హామీ పనులు నిలిపివేసినట్లు సమాచారం. టీడీపీ సానుభూతిపరులు ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టుల కోసం పెద్ద సంఖ్యలో ఆశావహులు ముందుకొస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లుగా ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై టీడీపీ మండల స్థాయి నాయకులకు తలనొప్పిగా మారిందని చర్చ సాగుతోంది. ఏది ఏమైనా మండలంలో గత రెండు వారాల నుంచి ఉపాధి హామీ పనులకు బ్రేక్ పడడంతో ప్రతిరోజూ ఉపాధి పనులకు వెళ్లే 2 వేల మంది కూలీలు పనుల్లేక అవస్థలు పడుతున్నారు.



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

రైతుల పొలాల్లో భూసార పరీక్షలు

మర్రిపాడు: వ్యవసాయశాఖ సిబ్బంది రైతుల పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మర్రిపాడు వ్యవసాయాధికారి ఎస్.రామ్మోహన్ తెలిపారు. సోమవారం మర్రిపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న రైతుల భూముల్లో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మర్రిపాడు మండలంలో 329 మట్టి నమూనాలను సేకరించి నెల్లూరు భూసార పరీక్ష కేంద్రానికి పంపినట్లు తెలిపారు. వాటి ఫలితాలను రైతుల మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ పంపుతామని తెలిపారు. భూసార పరీక్షల వల్ల భూమిలో పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చని, ఎరువులు ఏ మోతాదులో వినియోగించాలో తెలుస్తుందని న్నారు. పంటల సాగుకు భూసార పరీక్షలు ఎంతో అవసరమని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూసార పరీక్షల ఫలితాల కార్డులకు అనుగుణంగా ఎరువులు వేసుకుంటే పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులను సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె.వెంకటేశ్వర్లు, వ్యవసాయ సహాయకులు ఎస్.లక్ష్మీలహరి, సీహెచ్ పవన్‌కల్యాణ్, రైతులు పాల్గొన్నారు.



రైతు పొలంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

ఇన్‌చార్జి ఆర్డీఓగా రాజా రమేష్ ప్రేమ్‌కుమార్

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్డీఓ కురుబ మధులత సెలవుపై వెళ్లడంతో ఆత్మకూరు తెలుగుగంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజా రమేష్ ప్రేమ్‌కుమార్ సోమవారం ఇన్‌చార్జి ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ డివిజన్‌లోని వివిధ గ్రామాల నుంచి 7 వినతులు అందాయని, సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జి ఆర్డీఓ రాజా రమేష్ ప్రేమ్‌కుమార్

ఘన స్వాగతం పలుకుదాం

జలదంకి: ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రమాణ స్వీకారం చేసి మంగళవారం జలదంకి మండలానికి వస్తున్న సందర్భంగా మండలంలోని నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలుకుదామని టీడీపీ మండల అధ్యక్షుడు పులుగుంట మధురెడ్డి అన్నారు. సోమవారం ఆయన జలదంకిలో మండలంలోని నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలపాళెం నుంచి కలిగిరి మీదుగా వింజమూరులోని టీడీపీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.